


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 06-12-2025 | సంపుటి - 26 | సంచిక -199 | రూ : 4 | పేజీలు: 8




## నర్సంపేటలో రూ.532 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్
- రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల
- రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ

2లో

: సీఎం రేవంత్‌రెడ్డి

## ద్వైపాక్షిక సహకారంపై మోదీ-పుతిన్ సంయుక్త ప్రకటన..

- భారత్, రష్యా మధ్య 2030 వరకు వాణిజ్య విస్తరణకు ఒప్పందం
- 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం లక్ష్యం
- భారత్‌కు నిరంతరాయంగా ఇంధన సరఫరా చేస్తామని పుతిన్ హామీ
- యూరియా, షిప్పింగ్, ఆహార భద్రత రంగాల్లో కీలక అవగాహన ఒప్పందాలు
- ఇండియా నేతృత్వంలోని ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్‌లో చేరనున్న రష్యా



2లో

## ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్



2లో

## అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవు

: సర్పంచ్‌లతో కేసీఆర్

- కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయి... వాటికి వెరవకూడదన్న కేసీఆర్
- గజ్వేల్ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం
- మర్యాదపూర్వకంగా కేసీఆర్‌ను కలిసిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు

2లో



## పాన్ మసాలాపై కొత్త సెస్సు..

### బిల్లుకు లోక్ సభ ఆమోదం



2లో

- పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు
- జాతీయ భద్రత, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపయోగించాలని నిర్ణయం
- సెస్సును రాష్ట్రాలతో కలిసి పంచు కుంటామని వెల్లడి

## గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి



2లో

## హైకోర్టుకు హాజరై క్షమాపణలు చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

- నవంబర్ 27న విచారణకు హాజర కాలేకపోయినందుకు క్షమాపణ
- వరదలు సంభవించిన ప్రాంతానికి వెళ్లవలసి వచ్చిందని వెల్లడి
- బతుకమ్మ కుంట కేసు విచారణలో హైకోర్టుకు హాజరు



2లో

## వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు... స్వాగతించిన మంత్రి అజారుద్దీన్



2లో

## దేవాలయాల సంపద దేవుడిదే.. బ్యాంకులకు వాడొద్దు

: సుప్రీంకోర్టు సంచలన తీర్పు

2లో

# గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి

అమరావతి, డిసెంబర్ 05 : తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు హాజరుకావాల్సిందిగా చంద్రబాబును ఆయన ఆహ్వానించారు. శుక్రవారం అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ వేదికగా ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. ఈ సదస్సును ప్రపంచ ప్రఖ్యాత దావోస్ సదస్సు తరహాలో నిర్వహిస్తున్నామని చంద్రబాబుకు వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అధికారికంగా ఆహ్వానాన్ని అందించిన కోమటిరెడ్డి, సమ్మిట్ ప్రాధాన్యతను ముఖ్యమంత్రికి తెలియజేశారు.





## అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవు: సర్పంచ్‌లతో కేసీఆర్

ఢిల్లీ, డిసెంబర్ 05 : అన్ని కాలాలు మనకు అనుకూలంగా ఉండవని, కొన్ని సమయాల్లో కష్టాలు వస్తాయని, వాటికి వెరవకూడదని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మళ్ళీ మన ప్రభుత్వం వస్తుందని, తెలంగాణ పల్లెలకు మంచి రోజులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పటిదాకా ప్రజలు అధైర్యపడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త సర్పంచ్‌లు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివద్ధి చేసుకునేందుకు ముందుకు సాగాలని సూచించారు. కేసీఆర్ దత్తత తీసుకున్న గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని తన నివాసానికి సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్, శాలువాతో సత్కరించి మిఠాయిలు పంచారు. ఈ రెండు గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అధినేతను కలిశారు. నూతనంగా ఎన్నికైన ఎర్రవెల్లి గ్రామ సర్పంచి నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, గ్రామ ఉప సర్పంచ్ ఎడ్మ సబితా కరుణాకర్, వార్డు మెంబర్లు, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య, ఇరు గ్రామాలకు చెందిన ప్రముఖులు కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. వారిని కేసీఆర్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి చెందాయని తెలిపారు. స్వయం పాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని అన్నారు. దళిత, గిరిజన, బహుజన, మహిళా వర్గాలకు, కుల వృత్తులకు తాము అందించిన ప్రోత్సాహం, గ్రామీణాభివృద్ధికి అమలు చేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పాటు అందించాయని పేర్కొన్నారు. తాను ముఖ్యమంత్రిగా చేపట్టిన పాలనా సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.

## వక్ఫ్ ఆస్తుల నమోదుకు గడువు పెంపు... స్వాగతించిన మంత్రి అజారుద్దీన్

హైదరాబాద్, డిసెంబర్ 05 : దేశవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను 'ఉమీద్' పోర్టల్‌లో నమోదు చేసేందుకు విధించిన గడువును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ స్వాగతించారు. ఈ అదనపు సమయాన్ని సద్వినియోగం చేసుకొని, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు, ముతావల్లీలకు (ఆస్తుల సంరక్షకులు) ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయంపై కీలక ప్రకటన చేశారు. వక్ఫ్ ఆస్తుల నమోదుకు శుక్రవారంతో గడువు ముగిసినప్పటికీ, మరో మూడు నెలల పాటు ఎలాంటి జరిమానా విధించబోమని స్పష్టం చేశారు. ఈలోగా నమోదు చేసుకోలేని వారు తమ రాష్ట్రాల్లోని వక్ఫ్ ట్రైబ్యునళ్లను సంప్రదించవచ్చని సూచించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 9 లక్షల వక్ఫ్ ఆస్తులకు గాను, ఇప్పటివరకు కేవలం 1.51 లక్షల ఆస్తులు మాత్రమే పోర్టల్‌లో నమోదయ్యాయని కేంద్ర మంత్రి తెలిపారు. గడువు పొడిగించాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. సాంకేతిక సమస్యలు, శతాబ్దాల నాటి రికార్డుల లభ్యతలో జాప్యం, ముతావల్లీలకు ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని ఆయన ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్ని ఆస్తుల వివరాలను కచ్చితత్వంతో, పారదర్శకంగా నమోదు చేసేందుకు కనీసం ఏడాది పాటు గడువు పొడిగించాలని కోరారు. "వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, పారదర్శకతను బలోపేతం చేయడానికి ఈ గడువు పొడిగింపు చాలా ముఖ్యం. దీనివల్ల తెలంగాణ ప్రజలకు ఈ సంస్థల ద్వారా అందే సేవలు, మద్దతు నిరంతరాయంగా కొనసాగుతాయి" అని మంత్రి అజారుద్దీన్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్

అమరావతి, డిసెంబర్ 05 : ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులపై ఉపాధ్యాయులు ఎక్కువ శ్రద్ధ చూపే అవకాశం ఉందని, ప్రభుత్వ టీచర్లే ఉత్తమమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయవిద్యార్థి నిష్పత్తి మెరుగ్గా ఉందని, ప్రతి 18 మంది విద్యార్థులకు ఒక టీచర్ అందుబాటులో ఉండగా, ప్రైవేట్ పాఠశాలల్లో 25 మందికి ఒకరే ఉన్నారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లా, భామినిలోని ఏపీ మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన "మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 3.0" కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, రాష్ట్ర విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "గత ప్రభుత్వం ఉపాధ్యాయులను అవమానించింది, మద్యం షాపుల వద్ద డ్యూటీలు వేసింది. కానీ మా ప్రభుత్వం టీచర్లకు గౌరవం ఇస్తుంది. మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయులను నియమించాం. పారదర్శకంగా బదిలీలు చేపట్టాం. టీచర్లను గౌరవించే బాధ్యత మాది, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులది," అని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని అందరూ కోరుకునే పరిస్థితిని తీసుకొస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**'కలలకు రెక్కలు'.. విదేశీ విద్యకు భరోసా**

రాష్ట్రంలోని విద్యార్థులు ఉన్నత, విదేశీ విద్యకు దూరమవ్వకూడదనే లక్ష్యంతో 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం కింద విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు అయ్యే ఖర్చు మొత్తాన్ని పావలా వడ్డీకే రుణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు తమ ఆశయాలను చంపుకోవాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానానికి దేశంలోనే ప్రథమ స్థానం దక్కేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా, విద్యాశాఖను సమర్థంగా నిర్వహిస్తున్నారంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ను చంద్రబాబు అభినందించారు.

* **ఆవిష్కరణలకు పెద్దపీట.. ఇన్నోవేటర్స్ సమ్మిట్**

విద్యార్థుల్లో సృజనాత్మకతను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వచ్చే ఏడాది జనవరిలో "స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్" నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఏడో తరగతి నుంచే విద్యార్థులను వినూత్నంగా ఆలోచించేలా తీర్చిదిద్దుతామని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో వారి ప్రతిభను గుర్తించి పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యే అవకాశం కల్పిస్తామని చెప్పారు. భామిని మోడల్ స్కూల్‌లోని ల్యాబ్స్‌ను పరిశీలించిన ఆయన, 'క్లిక్కర్ టూల్' ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసే విధానాన్ని ప్రశంసించారు. 'స్కై, మౌంటెన్, స్టీమ్'గా విద్యార్థులను వర్గీకరించి, వారి బలాబలాలకు అనుగుణంగా బోధన చేయడం మంచి ఫలితాలనిస్తుందన్నారు.

* **విలువలతో కూడిన విద్య.. సంపూర్ణ వికాసం**

చదువుతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగానే చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం కోసం 'డొక్కా సీతమ్మ' పథకాన్ని, రాజకీయ రంగులు లేని స్టూడెంట్ కిట్లను అందిస్తున్నామని గుర్తుచేశారు. శనివారం 'నో బ్యాగ్ డే' వంటి కార్యక్రమాలతో విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునే వాతావరణం కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ద్వైపాక్షిక సహకారంపై
## మోదీ-పుతిన్ సంయుక్త ప్రకటన

ఢిల్లీ, డిసెంబర్ 05 : భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక బంధం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం కీలక ఒప్పందాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 2030 వరకు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఉద్దేశించిన ఒక సమగ్ర ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇరువురు నేతలు ఆమోదం తెలిపారు. ఈ చారిత్రక భేటీ అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు.

* **అంబరాన్నంటే లక్ష్యాలు... కొత్త శిఖరాలకు వాణిజ్యం**

ఈ సమావేశంలో ఇరు దేశాలు అత్యంత ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2025 నాటికి పరస్పర పెట్టుబడులను 50 బిలియన్ డాలర్లకు, 2030 నాటికి వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా యురేషియన్ ఎకనామిక్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (FTA) వీలైనంత త్వరగా ముగించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక, భారత్‌రష్యా మధ్య వాణిజ్య సంబంధాలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

* **ఇంధనం నుంచి ఎరువుల వరకు... ఒప్పందాల వెల్లువ**

ఈ సమావేశంలో ఇరు దేశాల నేతల సమక్షంలో పలు కీలక రంగాల్లో అవగాహన ఒప్పందాలు (MoUs) జరిగాయి. ముఖ్యంగా, అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు పుతిన్ హామీ ఇచ్చారు. ఇది భారతదేశ ఇంధన భద్రతకు ఎంతో కీలకమైన భరోసా. అదేవిధంగా, ఎరువుల రంగంలో ఒక పెద్ద ముందడుగు పడింది. రష్యాకు చెందిన ప్రముఖ సంస్థ 'యురాల్‌కెమ్' (URAL CHEM)తో భారతీయ కంపెనీలు కలిసి రష్యాలో ఒక యూరియా ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది ద్వైపాక్షిక పారిశ్రామిక సహకారంలో ఒక ముఖ్యమైన పరిణామం. దీనివల్ల భారత రైతాంగానికి ఎరువుల సరఫరా మెరుగుపడనుంది. వీటితో పాటు ఆహార భద్రత, నౌకాయాన శిక్షణ, వైద్య శాస్త్రాలు, వినియోగదారుల రక్షణ, పోర్టులు, షిప్పింగ్ రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు కూడా ఒప్పందాలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI), రష్యాకు చెందిన వినియోగదారుల రక్షణ సంస్థ మధ్య కుదిరిన ఒప్పందం ఇరు దేశాల మధ్య ఆహార ఉత్పత్తుల వాణిజ్యానికి మరింత ఊతమిస్తుంది.

## పాన్ మసాలాపై కొత్త సెస్సు.. బిల్లుకు లోక్ సభ ఆమోదం

ఢిల్లీ, డిసెంబర్ 05 : పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధిస్తూ, తద్వారా వచ్చే నిధులను జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి వినియోగించాలని ప్రతిపాదించే 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు 2025'ను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. పాన్ మసాలా కంపెనీలపై సెస్సును ప్రతిపాదిస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, ప్రజారోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, సెస్సు ద్వారా వచ్చే నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు వర్తిస్తుంది. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీ గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సెస్సు వల్ల జీఎస్టీ రాబడిపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధిస్తామని పేర్కొన్నారు. 201014 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గినట్లు ఆమె వెల్లడించారు.

## హైకోర్టుకు హాజరై క్షమాపణలు చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, డిసెంబర్ 05 : హైడ్రా కమిషనర్ రంగనాథ్ గత నెల 27న జరిగిన విచారణకు హాజరు కాలేకపోయినందుకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకు క్షమాపణలు తెలిపారు. తీవ్ర వరదలు సంభవించిన ప్రాంతానికి వెళ్లవలసి వచ్చినందున విచారణకు హాజరుకాలేకపోయానని ఆయన కోర్టుకు విన్నవించుకున్నారు. హైదరాబాద్ నగరంలోని బతుకమ్మ కుంట కేసు విచారణలో భాగంగా ఆయన ఈరోజు కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో హైడ్రాపై ఎ. సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు రంగనాథ్ కోర్టుకు హాజరై క్షమాపణలు చెప్పారు. బతుకమ్మ కుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథ స్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలని సుధాకర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అక్టోబర్ 31న దీనిని విచారించిన హైకోర్టు, కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో నవంబర్ 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని హైడ్రా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే, బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున విచారణకు ప్రత్యక్షంగా హాజరు కాలేకపోతున్నానని, హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం నవంబర్ 27న విచారణ చేపట్టింది. అధికారిక విధుల కారణంగా మినహాయింపు కోరుతున్నారని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. అయితే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కోర్టు తలచుకుంటే ధిక్కరణను ఎదుర్కొంటున్న కమిషనర్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు కోర్టులో నిలబెట్టగలదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది.

### నర్సంపేటలో రూ.532 కోట్లతో
## అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

నర్సంపేట, డిసెంబర్ 05 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో పర్యటించి, అభివృద్ధి పనులపై వరాల జల్లు కురిపించారు. ఈరోజు ఆయన రూ.532.24 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన పనులలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.130 కోట్లతో ప్రభుత్వ వైద్య కళాశాల, రూ.26 కోట్లతో నర్సింగ్ కాలేజీ, పలు రోడ్ల విస్తరణ పనులు ఉన్నాయి. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నేతలు ఫాంహౌస్‌లు కట్టుకున్నారు, విమానాలు కొన్నారు కానీ, ఉద్యమగడ్డ వరంగల్‌కు ఏమీ చేయలేదు. వారు ఆస్తులు సంపాదించుకున్నారు తప్ప ఈ ప్రాంత అభివృద్ధిని గాలికొదిలేశారు" అని ఆయన మండిపడ్డారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటోందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేశామని, రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల 10 లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో కేసీఆర్ పేదలను మోసం చేశారని, తాము పేదల ఆత్మగౌరవం నిలబెట్టేందుకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం స్పష్టం చేశారు. మార్చి 31 లోగా వరంగల్‌లో ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తామని ప్రకటించారు.

# హరిహర సుతుడు అయ్యప్ప స్వామి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : హరిహర సుతుడు అయ్యప్ప స్వామి వారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి లోని శ్రీశ్రీశ్రీ అయ్యప్ప దేవస్థానం 8వ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై హరిహర సుతుడు అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చింతల దేవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ చింతల లక్ష్మీ దేవేందర్, కొంపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, మాజీ కౌన్సిలర్ దప్పు కిరణ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ ఆలయ కమిటీ సభ్యులు గంగల వెంకటేష్, సభ్యులు సతీష్, రఘు, రాకేష్, ధర్మ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతల దేవేందర్, తాజా మాజీ కౌన్సిలర్ విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బర్మ ప్రవీణ్, దుండిగల్ మునిసిపల్ యూత్ అధ్యక్షులు మైసిగారి శ్రీకాంత్, నాయకులు గంగయోల వెంకటేష్, బోగారం వెంకటేష్, గరిసె సతీష్, మంత్రి రఘునాథ్, గంగయోల రాకేష్, చింతల రాజు యాదవ్, పోశెట్టి భిక్షపతి, యాదగిరి యాదవ్, సాయినాథ్, మరియు స్థానిక నాయకులు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండల పరిధిలోని బాలాజీ నగర్ గ్రామపంచాయతీ సర్పంచుగా భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా వాసం లక్ష్మీ , ఇంద్రనగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా ఈసం రాజేశ్వరి తమ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థుల వెంట ఇల్లందు మండల అధ్యక్షుడు శీలం రమేష్,మండల ప్రధాన కార్యదర్శి శ్రీమతి ఖమ్మంపాటి రేణుక, మాజీ వైస్ ఎంపీపీ దాసం ప్రమోద్, మాజీ కోషన్స్ సభ్యులు, గాజి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ,ఇల్లందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, ఎస్ కే యాకుబ్బి, ఇల్లందు మండల యువజన నాయకులు నీలం రాజశేఖర్, ఇల్లందు మండల నాయకులు పూదూరి లక్ష్మీనారాయణ ఇల్లందు నియోజకవర్గ సోషల్ మీడియా , యువజన _ నాయకులు, యువజన గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తా!: పట్టు పడితే వదిలేదాన్ని కాదు

* **ఇరవై ఏళ్ళు కష్టపడితే పార్టీ నుండి సస్పెండ్ చేశారు:**
* **మహిళా శక్తి ఏంటో చూపిస్తా:**
* **జగద్గిరిగుట్ట లో బస్సు డిపో, మెడికల్ కాలేజీ ఏర్పాటు కలేనా...?**
* **కబ్జాలపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా..?**
* **కుత్బుల్లాపూర్ లో జనం బాటలో కల్వకుంట్ల కవిత ఫైర్..**





ప్రజాస్ఫూర్తి,కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ను కాస్త కబ్జాలాపూర్ గా పేరు మారిస్తే బాగుటుందేమోనని ఇక్కడి కబ్జాలు చూస్తే అర్థం అవుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జనం బాటలో భాగంగా శుక్రవారం జాగృతి బిసి రాష్ట్ర అధ్యక్షులు ఎత్తరి మారయ్య ఆధ్వర్యంలో శాపూర్ నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఆసుపత్రి సిబ్బంది, రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గాజులరామారంలో గల పరికి చెరువును, సూరారం లోని లింగం చెరువును పరిశీలించి చెరువు అక్రమణలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మల్లంపేటలో జాగృతి లోకి నూతనంగా చేరిన వారికి ఆమె కండువా కప్పి జాగృతి లోకి ఆహ్వానించారు. చర్చి గాగిల్లాపూర్ లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జాగృతి నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 60 ఎకరాల్లో విస్తరించి ఉండాల్సిన పరికి చెరువు సగానికి పైగా కబ్జా కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 62 ఎకరాలు ఉంటే ఇప్పుడు మాత్రం 16 ఎకరాలకు కుదించుకుపోయిందని చుట్టు పక్కల వాళ్లు చెరువు పరిరక్షణ కోసం ఎన్నో కేసులు పెట్టారని తెలిసిందని అగ్రహం వ్యక్తం చేసింది. పొలిటికల్ మేనేజ్ మెంట్ చేస్తూ చెరువు తినేశారని ఈ కబ్జాల తతంగం లో అన్ని పార్టీల వాళ్లు ఉన్నారన్నారంది. ఇప్పటికీ కూడా ఇక్కడ నిర్మాణంలో ఉన్న ఇళ్ల పహానీలు చూస్తే ఎఫ్టీఎల్ లో ఉన్నట్లు చూపిస్తున్నాయని, ఎఫ్టీఎల్ లో ఉన్నప్పటికీ నిర్మాణాలకు ఎలా అనుమతిస్తున్నారని ఇది గతపాలకుల, అధికారుల అలసత్వం అని ఏద్దేవా చేసింది.? ఎఫ్టీఎల్ అని రాసి ఉన్న రాళ్లను కూడా రియల్ ఎస్టేట్ మాఫియా భయం లేకుండా తీసేసిందని, హైడ్రా కమిషనర్ కచ్చితంగా దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే గతంలో టీడీపీ లో ఉండి బీఆర్ఎస్ లోకి వచ్చారు. రేపు ఎక్కడ ఉంటారో తెలియదన్నారు. ఆయన అండదండలతోనే చెరువుల కబ్జాలు జరిగయన్నారు. పేదవాళ్ల ఇళ్లే కాదు, పెద్ద వాళ్ల ఇళ్లను కూడా కూల్చేస్తామని మెసేజ్ ఇవ్వాలన్నారు. గత ఎన్నికల్లో జగద్గిరిగుట్ట బస్సు డిపో ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చిన ప్రజా ప్రతినిధులకు ఇప్పటి వరకు ఏర్పాటు చేసే సోయిలేదా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. మెడికల్ కాలేజీ మంజూరైన దానిని ఏర్పాటు చేసే దమ్ము కూడా ఇక్కడి నాయకులకు లేదా అని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్ లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి పేదలకు అందజేయాలని డిమాండ్ చేసింది. ప్రజల పక్షానే జాగృతి పోరాటం చేస్తుందని... పేదలకు న్యాయం చేయకుండా మోసం చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రాగిడి వెంకటరామిరెడ్డి, అధికార ప్రతినిధి పడాల మనోజ్, శీలం వీరేందర్, సీతారాం, సంధ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా బట్టబయలు

* **300 క్వింటాళ్లు నల్లబజారుకు మళ్లింపు – మాఫియా రింగ్ వెలుగు చూసింది**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని జి.సి.సి.ఎస్ ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ వద్ద జరిగిన పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం బట్టబయలైంది. విశ్వసనీయ సమాచారం మేరకు రాష్ట్ర విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లయ్స్ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు.ఏపీ 20 ఏవీ 1899 నంబర్ గల బైక్‌పై వచ్చిన ప్రసాంత్ అనే వ్యక్తిని అనుమానంతో విచారించగా, ఆయన స్టేజ్-I కాంట్రాక్టర్ ఎన్. శ్రీనివాస్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు తెలిపాడు. మల్లారం మార్కెట్ కమిటీ గోదాం నుంచి రావాల్సిన 'సన్న బియ్యం'ను జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను మార్చి టిఎస్29టి 5139 లారీకి సంబంధించిన నకిలీ ట్రక్ చిట్ (నం.4346)తో ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎంట్రీలు చేయించి, అసలు బియ్యాన్ని నల్లబజారుకు మళ్లించినట్లు అధికారులు నిర్ధారించారు. మొత్తం 600 సంచులు (300 క్వింటాళ్లు) వేరే మార్గంలో తరలించినట్లు తేలింది. తదుపరి దర్యాప్తులో కాంట్రాక్టర్ ఎన్. శ్రీనివాస్ (భార్య ఎన్.సరోజా పేరుతో) మణుగూరు రైస్ మిల్లర్ నరహరికి పిడిఎస్ బియ్యం సరఫరా చేసినట్లు ఒప్పుకున్నాడు. ప్రతి లారీకి రూ.50 వేల చొప్పున ఐదు దఫాలు పంపినట్లు తెలిపారు. ఎంఎల్ఎస్ ఇన్‌చార్జ్ సత్యవతి, డేటా ఎంట్రీ ఆపరేటర్ కృష్ణకుమార్, హమాలి నాగరాజు కూడా నకిలీ ఎంట్రీల్లో పాత్ర వహించినట్లు ఒప్పుకున్నారు. కొంతమంది డీలర్లు బయోమెట్రిక్ ద్వారా సరుకులు తీసుకున్నట్లు నమోదు చేసినప్పటికీ అసలు బియ్యం తీసుకోలేదని వెల్లడైంది. లారీ డ్రైవర్ అనిల్‌కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ వ్యవహారంలో క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ , మోసం, కుట్ర, కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ - 1955, పిడిఎస్ కంట్రోల్ ఆర్డర్ - 2016 కింద కఠిన చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డి.సి.ఓ. ప్రేమ్‌కుమార్, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్‌బాబు, ఓఎస్డీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# కింగ్డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీ" 2026వ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద "కింగ్డమ్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీ" ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2026వ నూతన సంవత్సర క్యాలెండర్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం ఈ నెల 25వ తారీఖున నిర్వహించనున్న క్రిస్మస్ మహోత్సవానికి ఎమ్మెల్యే ని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిషప్ క్రీస్తు రాజు, పాస్టర్ సత్యనారాయణ, పాస్టర్ అమృత్ కుమార్, పాస్టర్ జాన్ వాతాడ, పాస్టర్ ఆంథోని, శకుంతల, వరలక్ష్మి, లక్ష్మి ఎస్తేరు రాణి, సుధీర్, ప్రకాష్ కుమార్, ప్రశాంత్, జాషువా, సువర్ణ, రిషి వర్మ, భాస్కర్, సన్నీ, దేని, నాగరాజు, ఆనంద్, కేసిఎం సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా మంత్రి దామోదర్ జన్మదిన వేడుకలు...

- **కేజీబీవీ విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు .**
- **దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ను పంపిణి చేసారు.**
- **బాలాజీ హాస్పిటల్ అద్వర్యంలో మెడికల్ , బ్లడ్ డొనేషన్ క్యాంపు ల ఏర్పాటు..**

అందోలు,ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా జన్మదిన వేడుకలను శుక్రవారం జోగిపేటలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుండి మంత్రి దామోదర్ రాజనర్సింహా అభిమానులు నివాసానికి తండోప తండాలుగా తరలివచ్చి వారి అభిమాన నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిగా అభిమానులు తరలివచ్చిన అభిమానులతో వారితో కలసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అందోల్ జోగిపేట పట్టణం లో పర్యటించారు. మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ చౌరస్తా లో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గజా మాలతో మంత్రిని సత్కరించారు. అనంతరం కస్తూర్బగాంధీ బాలికల విద్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కేజీబీవీ , నర్సింగ్ విద్యార్థినీలతో కలసి కేకు కట్ చేశారు . విధ్యార్థినిలతో కలసి భోజనం చేశారు . మంత్రి దామోదర్ రాజనర్సింహా స్వయంగా విద్యార్థినులకు భోజనం వడ్డించారు. పర్యటనలో భాగంగా కార్యకర్తలు , అభిమానులు జోగిపేట లోని శ్రీరామ గార్డెన్ లో మంత్రి దామోదర్ రాజనర్సింహా గారి జన్మదిన వేడుకల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పాల్గోన్నారు . కార్యక్రమం లో భాగంగా బాలాజీ హాస్పిటల్ వారి అద్వర్యం లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు ను , బ్లడ్ డొనేషన్ క్యాంపు లను ప్రారంభించారు . అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిల్స్ ను పంపిణి చేసారు. తరలివచ్చిన వేలాది మంది అభిమానులు మంత్రి దామోదర్ రాజనర్సింహా ను గజమాలతో సత్కరించారు. భారీ బర్త్ డే కేక్ ను తరలివచ్చిన అభిమానుల సమక్షం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా కట్ చేశారు . మంత్రి గారికి తరలివచ్చిన అభిమానులు ఒక్కొక్కరి కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమం లో నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డా . సంజీవ రెడ్డి , రాష్ట్ర చైర్మన్ గిరిధర్ రెడ్డి , మెదక్ డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , మెదక్ , సంగారెడ్డి జిల్లాల గ్రంధాలయ సంస్థ అధ్యక్షులు సుహాసిని రెడ్డి , అంజయ్య , మార్కెట్ కమిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి , జగన్మోహన్ రెడ్డి , జిల్లా సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్ , మార్క్ ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్ మోహన్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య , అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , నియోజక వర్గ ముఖ్య నాయకులు , అభిమానులు పాల్గోన్నారు .

# రేగళ్ల నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. రేగళ్ల గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ సందర్శించారు. అక్కడ విధులలో ఉన్న పోలీస్ అధికారులు,ఎన్నికల అధికారులను నామినేషన్ ప్రక్రియ సరళిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న స్టాటిక్ సర్వేలేయన్స్ చెక్పోస్టును సందర్శించారు.అక్కడ వాహన తనిఖీల వివరాల రిజిస్టర్ ను ఎస్పీ తనిఖీ చేశారు.ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా నగదు,మద్యం,మరే ఇతర వస్తువులను అక్రమ రవాణాకు ప్రయత్నించే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి,అట్టి వాహనాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని చెక్పోస్టుల వద్ద నిత్యం వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు,లక్ష్మిదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి,తదితరులు పాల్గొన్నారు

## గుండ్లబావి సర్పంచ్ అభ్యర్థిగా నందగిరి పరమేష్ గౌడ్ నామినేషన్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం గుండ్లబావి గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నందగిరి పరమేష్ గౌడ్ పంతంగి క్లస్టర్ల లో శుక్రవారం నామినేషన్ వేశారు. అంతకుముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నందగిరి పరమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాసేసే లక్ష్యంగా ప్రజల ముందుకు వచ్చానన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో కోటి రూపాయల నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేసుకున్నామని గుర్తు చేశారు. ప్రజలు తనని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలి

* **అధికారులను ఆదేశించిన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా త్వరితగతిన పనులను చేపట్టి పూర్తి చేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ , గాజులరామారం జంట సర్కిళ్ళ కార్యాలయాలలో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే శుక్రవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం 10 కోట్ల రూపాయలు మంజూరు కాగా, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో 3.50 కోట్ల రూపాయలు మంజూరవగా, జంట మున్సిపల్ సర్కిల్లో పరిధిలోని పలు కాలనీలలో చేపట్టవలసిన రోడ్డు నిర్మాణ పనులు, స్మశాన వాటికల అభివృద్ధి పనులు, పార్కుల అభివృద్ధిపై ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంజూరైన నిధులతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు, స్మశానవాటికల అభివృద్ధి, పార్కుల అభివృద్ధి వంటి పనులలో ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో గాజుల రామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## కోకాపేటలో నాలుగో విడత వేలం.. రూ.3,862 కోట్లు దాటిన హెచ్ఎండీఏ ఆదాయం




హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కోకాపేటలోని నియోపోలిస్‌లో వేలంపాటను విజయవంతంగా పూర్తి చేసింది. వేలంలో ఈసారి హెచ్ఎండీఏ ఆదాయం రూ.3,862 కోట్లు దాటింది. నియోపోలిస్ స్థలాలకు భారీగా డిమాండ్ ఉండటంతో పలు రకాల వ్యాపార, వాణిజ్య సంస్థలు పోటీపడి భూములను దక్కించుకున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈవేలంలో 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ స్థలాన్ని COEUS ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎకరా రూ.77.75 కోట్లకు దక్కించుకుంది. దీంతో ఇప్పటి వరకు నాలుగు విడుతలుగా జరిగిన వేలం పాటలో హెచ్ఎండీఏ ఆదాయం గతేడాది కంటే 87 శాతం వృద్ధి సాధించింది.

## తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

**: సోనియాగాంధీ**

హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలక పాత్ర పోషించనుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియాగాంధీ సందేశం పంపించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు,



అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహించనున్నందుకు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొననున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఏసీబీ వలలో హనుమకొండ అదనపు కలెక్టర్




హనుమకొండ: హనుమకొండ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. రూ.60 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. హనుమకొండ జిల్లా ఇన్‌ఛార్జి డీఈవోగానూ వెంకట్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓ ప్రైవేట్ స్కూల్ రెన్యువల్‌కు లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. వెంకట్‌రెడ్డితోపాటు జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

## మెడికల్ కోడింగ్‌లో శిక్షణ పేరుతో నిరుద్యోగులకు కుచ్చు టోపి




మాదాపూర్: మెడికల్ కోడింగ్‌లో శిక్షణతోపాటు ఉద్యోగం ఇస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేసిన ఇద్దరు నిందితులు పత్తాలేకుండా పోయారు. మోసపోయిన బాధితులు తమకు న్యాయం చేయాలంటూ మాదాపూర్ పోలీసులను ఆశ్రయించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌లో మైండ్ స్పార్క్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్, మాదాపూర్‌లో ప్రిడెక్స్ పేరిట దిలీప్‌కుమార్ అనే వ్యక్తి రెండు శిక్షణ సంస్థలను నిర్వహిస్తున్నాడు. ఇదే సంస్థలో శివారెడ్డి మేనేజర్‌గా, శ్రీకాంత్ జోషి లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సైన్స్ సబ్జెక్ట్‌తో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో శిక్షణ ఇచ్చి, ఆ తర్వాత ఉపాధి కల్పిస్తామని నమ్మించారు. ఇందులో భాగంగా మొదట ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. దీంతో కరీంనగర్, సిద్దిపేటతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో సర్టిఫైడ్ ప్రొఫెషనల్ కోడర్ (సీపీసీ) కోర్సులో శిక్షణ కోసం రూ.15 వేల చొప్పున చెల్లించారు. ఆరు నెలల శిక్షణ అనంతరం విద్యార్థులకు సీపీసీ సర్టిఫికెట్లు జారీ చేశారు. అనంతరం అమెరికన్ అకాడమీ ఆఫ్ ప్రొఫెషనల్ కోడర్స్(ఏఏపీసీ) నిర్వహించే పరీక్ష రాయాల్సి ఉంటుందని, సదరు పరీక్ష రాసిన తర్వాత మెడికల్ కోడింగ్‌కు సంబంధించిన కంపెనీల్లో ఉద్యోగం కల్పిస్తామని శ్రీకాంత్ జోషి విద్యార్థులను నమ్మించాడు. తాను ఏఏపీసీ సర్టిఫైడ్ మెంబర్‌ని అని మాయమాటలు చెప్పి ఒక్కో విద్యార్థి నుంచి పరీక్ష ఫీజుతోపాటు, ఉద్యోగం కోసమంటూ రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశాడు. నవంబర్ 30న ఏఏపీసీ పరీక్ష ఉంటుందని, నగరంలోని అమీర్‌పేట, గచ్చిబౌలిలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయని చెప్పాడు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను నవంబర్ 29న జారీ చేస్తానని చెప్పడంతో ఆయా జిల్లాల నుంచి విద్యార్థులు 29న నగరానికి చేరుకున్నారు. హాల్ టికెట్ల కోసం ఫోన్‌లో శ్రీకాంత్ జోషిని సంప్రదించే ప్రయత్నం చేయగా.. అతని ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. శివారెడ్డి సైతం అందుబాటులోకి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన విద్యార్థులు మరుసటి రోజున మాదాపూర్లో ఉన్న ప్రిడెక్స్ కార్యాలయం వద్దకు వచ్చారు. నిందితులిద్దరూ అక్కడ లేకపోవడంతో సంస్థ సీఈఓ దిలీప్‌కుమార్‌ని కలిసి విషయం చెప్పారు. అయితే వారిద్దరూ డబ్బులు వసూలు చేసిన విషయం తన దృష్టికి రాలేదని, తమకు తెలియకుండా వారు డబ్బులు వసూలు చేశారని చెప్పాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు మాదాపూర్ పోలీసులను ఆశ్రయించారు. తమ వద్ద మొత్తం రూ.47 లక్షలు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం శివారెడ్డిని అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు శ్రీకాంత్ జోషి పరారీలో ఉన్నాడు.

## పవన్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా: మంత్రి కోమటిరెడ్డి

ఉండవల్లి: చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతోందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ''పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల మేరకు వ్యాఖ్యలు చేశా.. ఇప్పుడు చంద్రబాబును ఆహ్వానించడానికి వచ్చా. రెండు రాష్ట్రాలు కలిసి ఉండాలి.. అదే స్నేహం కొనసాగాలి. చంద్రబాబు విజన్ 2020



అభివృద్ధికి ప్రతిరూపం హైదరాబాద్'' అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

## సైఫాబాద్‌లో మాదక ద్రవ్యాలు సరఫరాచేస్తున్న ముఠా అరెస్ట్




హైదరాబాద్: సైఫాబాద్‌లో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. సైఫాబాద్ పీఎస్ పరిధిలోని ఐమ్యాక్స్ ఓపెన్ గ్రౌండ్ సమీపంలో.. సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్, సైఫాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు డ్రగ్స్ విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహమ్మద్ గులాం జిలానీ, ఫిరోజ్ బిన్ అలీ సులేమాన్ ఖాన్‌ల వద్ద నుంచి.. 100 గ్రాముల బ్రౌన్ షుగర్, 1350 గ్రాముల డ్రై గంజాయి, 7 మొబైల్ ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ సుమారు రూ.23.50 లక్షలు ఉంటుందని, జిలానీ ఒడిశా నుంచి డ్రగ్స్ తెచ్చి సాహిల్, సులేమాన్‌లకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. నవంబరు 4న రేతిబౌలి ప్రాంత వ్యక్తి మహమ్మద్ అహ్మద్‌కు 3 గ్రాముల బ్రౌన్ షుగర్ విక్రయించగా.. అతడు అధిక మోతాదులో తీసుకుని మరణించాడు. దీనిపై రాజేంద్రనగర్ పీఎస్‌లో కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను సైఫాబాద్ పీఎస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అప్పగించారు.



## హీలర్ సుగుణారావుకు ఘన సన్మానం

* **అంతర్జాతీయ వాలంటీర్స్ డే సందర్భంగా ప్రకృతి వైద్యసేవలకు గుర్తింపు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ వాలంటీర్స్ డేను పురస్కరించుకుని, కొత్తగూడెంలోని స్థానిక ఎ.వి.ఎన్. ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ప్రకృతి వైద్యులు, హీలర్ జి. సుగుణా రావును ఘనంగా సన్మానించారు. ఏ.టి.ఐ.సి., ఎ.ఎ.ఎ.ఒ., ఐక్య తల్లిదండ్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో సంస్థల నిర్వాహకులు మారుతి రత్నాకర్, లోగాని శ్రీనివాస్, మేకల జ్యోతిరాణి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, బాలు, కమలారాణి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రకృతి ఆశ్రమం ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా సుగుణారావు అందిస్తున్న సేవలను నిర్వాహకులు ప్రత్యేకంగా కొనియాడారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని అభినందనలు తెలిపారు

## హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణం కాదు: మావోయిస్టులు

చర్ల: దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా ప్రతినిధి వికల్ప్ పేరిట మావోయిస్టులు మరో లేఖ విడుదల చేశారు. నవంబర్ 27 నాటి లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చికిత్స కోసం ఓ కలప వ్యాపారి ద్వారా హిడ్మా విజయవాడ వెళ్లారని వికల్ప్ అందులో పేర్కొన్నారు. నిరాయుధుడైన హిడ్మా సహా ఆరుగురిని పోలీసులు హత్య చేశారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లో హిడ్మా చనిపోయాడని కట్టుకథ ప్రచారం చేశారన్నారు. ఆయన హత్యకు కలప వ్యాపారి, బిల్డర్, ఐటీడీఏ కాంట్రాక్టరే కారణమని పేర్కొన్నారు. హిడ్మా, శంకర్ ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మనీశ్ కుంజాం, సోని చేసిన తప్పుడు ఆరోపణలను ఖండించారు. ''అరెస్టైన వారిలో కామ్రేడ్ దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి లేరు.



పోలీసులతో వారిద్దరూ ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోలేదు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు దేవ్‌జీ కారణమని మాజీ ఎమ్మెల్యే మనీశ్ కుంజా ఆరోపించడం కుట్రే. విజయవాడలో అరెస్టైన కామ్రేడ్లకు న్యాయ సహాయం అందించాలి. ప్రజాపక్ష న్యాయవాదులు, హక్కుల కార్యకర్తలు వారికి సహాయం చేయాలి'' అని లేఖలో వికల్ప్ కోరారు.

# వంశీ అనుచరుడు రామాంజనేయులుకు ఈనెల 15 వరకు రిమాండ్

విజయవాడ: తెదేపా కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారు సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వల్లభనేని వంశీ అనుచరుడైన యర్రంశెట్టి రామాంజనేయులు (ఏ9)ను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరు పర్చారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని ఆయన ఇంట్లో ఉండగా గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. గత పది నెలలుగా నిందితుడు పోలీసులకు దొరక్కుండా అజ్ఞాతంలో ఉన్నాడు. ఇటీవల విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో పోలీసులు రామాంజనేయులును అరెస్ట్ చేసి ఎస్సీ, ఎస్టీ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరచగా.. ఈనెల 15 వరకు రిమాండ్ విధించారు.

**కిడ్నాప్‌లో కీలకపాత్ర**

తెదేపా కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను బెదిరించి కేసును ఉపసంహరించుకునేలా చేయడంలో రామాంజనేయులు కీలకపాత్ర పోషించాడు. సత్యవర్ధన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో హనుమాన్ జంక్షన్ తీసుకెళ్లి బెదిరించాడు. వాంగ్మూల పత్రాలపై సంతకాలు తీసుకున్నాడు. మరుసటి



రోజు బాధితుడిని విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లి.. ఈ కేసుకు తనకు సంబంధం లేదనీ, ఘటన జరిగిన సమయంలో తాను అక్కడ లేనని అతనితో న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం ఇప్పించాడు. వాంగ్మూలం ఇచ్చిన అనంతరం.. ఫిబ్రవరి 10న సత్యవర్ధన్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్లి.. మై హోమ్ బుజాలో వంశీని కలిపించారు. ఆ రాత్రి అక్కడే ఉంచి బెదిరించారు. అనంతరం 11న ఏపీ 40 బీజీ 5005 నంబరు గల కారులో మిగిలిన నిందితులతో కలసి విశాఖపట్నం తీసుకెళ్లాడు.

## మండలి వెంకట కృష్ణారావు అధికార భాషాసంఘం అధ్యక్షుడిగా పి.త్రివిక్రమరావు

అమరావతి: మండలి వెంకట కృష్ణారావు అధికార భాషాసంఘానికి అధ్యక్షుడిగా పి.త్రివిక్రమ రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నట్లు ఆదేశాల్లో తెలిపింది. వీటితో పాటు అధికార భాషా సంఘం చేయాల్సిన కార్యకలాపాలపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు భాష వాడుక తీరుపై తనిఖీలు చేయాలని నిర్దేశించింది. తెలుగు భాష వాడుకపై



సంబంధిత అధికారులకు తగు సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో తెలుగు భాష వినియోగాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికార కార్యక్రమాల్లో ఆంగ్లభాష ఉపయోగించడంపై నిర్బంధం విధించడంపై కార్యాచరణ రూపొందించాలని సూచించింది. అధికార కార్యక్రమాల్లో తెలుగు వినియోగంలో ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అధికార భాషాభివృద్ధి కోసం తగిన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రతి విద్యార్థిలోనూ నిగూఢమైన శక్తి.. దాన్ని వెలికితీయాలి

*** దాన్ని వెలికితీయాలి**

చిలకలూరిపేట రూరల్: నేటితరం విద్యార్థుల ఆలోచనలు, ప్రవర్తనే మన దేశ భవిష్యత్తును నిర్దేశిస్తాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ నిగూఢమైన శక్తి దాగి ఉంటుందని.. దాన్ని వెలికితీసి విద్యార్థులను ప్రతిభావంతులుగా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట శ్రీ శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం)కు పవన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. చదువే బలమైన ఆయుధమని.. లక్షలాది మెదళ్లను కదిలించే శక్తి విద్యకు మాత్రమే సాధ్యమని పవన్ అన్నారు. గురువును దైవంగా భావించే సంస్కృతి మనదని చెప్పారు. పిల్లల జీవితాలను ఉపాధ్యాయులే ఎక్కువ ప్రభావితం చేస్తారన్నారు. పాఠశాలలో సరైన గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ లేని విషయం తెలుసుకున్న పవన్ కల్యాణ్.. పూర్తిస్థాయి గ్రంథాలయంతో పాటు 25 కంప్యూటర్లను తన సొంత ఖర్చుతో సమకూరుస్తానని



హామీ ఇచ్చారు. ఆడుకునేందుకు సరైన గ్రౌండ్ లేదని విద్యార్థులు చెప్పడంతో అందుకు తగిన స్థలం చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఒకప్పుడు నాయకులు పాఠశాలల కోసం భూములు ఇచ్చేవారని.. ఇప్పుడు భూములు లాక్కోవడం వల్లే క్రీడా మైదానాలు లేకుండాపోయాయని ఈ సందర్భంగా పవన్ వ్యాఖ్యానించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇలాంటి సమావేశాలు ఎప్పుడు జరగలేదన్నారు. పవన్ కల్యాణ్‌తో 1998లో సినిమా తీయాలని భావించినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లోకి రావడంతో అది సాధ్యం కాలేదన్నారు.

## తుపాను బీభత్సం.. వీధినపడ్డ చేనేత 600 కుటుంబాలు

తుపాను కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో సిద్దవటం మండల మాధవరంలో చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 600 కుటుంబాలకు చెందిన మగ్గం గుంతలు పూర్తిగా నీట మునిగిపోయాయి. లోతైన గుంతల్లోకి వర్షపు నీరు చేరడంతో మగ్గాలు, వాటికి సంబంధించిన ముడిసరుకులు, బట్టలు దెబ్బతిన్నాయి. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయి వీధినపడ్డ పరిస్థితి నెలకొంది. జీవనాధారం కొట్టుకుపోవడంతో ఆయా కుటుంబాలు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నాయి. తక్షణ ఆర్థిక సహాయం అందకపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారనుంది.



*** కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి: జగన్మోహన్ రాజు**

మాధవరం గ్రామంలో రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి చామర్తి జగన్మోహన్ రాజు పర్యటించారు. నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలను పరామర్శించారు. వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు తుఫాన్ తీరని నష్టాన్ని కలిగించిందన్నారు. కూటమి ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. నష్టాన్ని అంచనా వేసి, వారికి తగిన ఆర్థిక భరోసా కల్పించాలని కోరతానని జగన్మోహన్ రాజు తెలిపారు.

## ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీది కీలకపాత్ర

**: కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్**



ఢిల్లీ: ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీ కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2026 ఫిబ్రవరిలో భారత్‌లో నిర్వహించబోతున్న ఏఐ వరల్డ్ సమ్మిట్‌లో భాగంగా ఏపీకి భాగస్వామ్యం కల్పించాలని రాజ్యసభలో తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు కోరగా.. సదస్సులో భాగంగా దేశ వ్యాప్తంగా 200 కార్యక్రమాలు చేపడతామని కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. ఏపీ, మహారాష్ట్ర, యూపీ తదితర రాష్ట్రాల్లో డేటా సెంటర్లు వస్తున్నాయన్నారు. డేటా సెంటర్ల కేంద్రంగా విశాఖ ఎదగడం శుభపరిణామమన్నారు.

## జగన్.. వివేకా హత్యతో సంబంధం లేదని అంగీకరించగలరా?



అమరావతి: గత ప్రభుత్వంలో తప్పులు చేసి మమ్మల్ని విమర్శిస్తారా అని మంత్రి సంధ్యారాణి ప్రశ్నించారు. పదేపదే అబద్ధాలు ఆడటం మాజీ సీఎం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. వైకాపా హయాంలో బకాయిలుగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, డైట్ బిల్లులు తామే చెల్లించామన్నారు. భోజనం, యూనిఫాం, పుస్తకాలు, కాస్మోటిక్స్ పిల్లలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ''వివేకా హత్యతో సంబంధం లేదని మీరు అంగీకరించగలరా? తల్లి, చెల్లిని ఇంట్లోంచి గెంటేసింది మీరు కాదా? గిరిజనుల మరణాలపై శవ రాజకీయాలు చేస్తున్నారు. గిరిజనులను చులకన చేసి అబద్ధాలు మాట్లాడితే ఊరుకోం. పరకామణి కేసులో చోరీ జరిగింది రూ.75 వేలే కదా అని జగన్ అంటున్నారు. రూ.75 వేలు అయితే దొంగతనం చేయవచ్చా?'' అని సంధ్యారాణి నిలదీశారు.

## బెత్తం దెబ్బలు తీపి గుర్తులుగా మిగిలిపోవాలి: మంత్రి ఆనం

ఆనాటి గురువుల బెత్తం దెబ్బలు తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోయాయని, దెబ్బలు తిన్న అరచేతులే నేడు ఉన్నత స్థానాల్లో సంతకాలు చేస్తున్నాయని, ఆనాటి సంగతులను, గురువుల గొప్పతనాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేటి తరం విద్యార్థులకు వివరించే ప్రయత్నం చేశారు. ఇందుకు చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో వచ్చిన ఓ



వీడియోను విద్యార్థులకు మంత్రి ఆనం చూపించారు. ఆ వీడియోలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత రంగాల్లో మంచి గుర్తింపు పొందిన వారందరూ, తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలి వద్దకు వెళ్లి, ఆమెతో వారి అనుబంధాన్ని గుర్తు చేసుకోవడం, తాము ఆనాడు తిన్న బెత్తం దెబ్బలను అరచేతులను చూపించి మళ్లీ కొట్టమని అడగడం వంటి మధురమైన దృశ్యాలను విద్యార్థులకు మంత్రి చూపించారు. బెత్తం దెబ్బల మాధుర్యాన్ని, గురువులకు, విద్యార్థులకు ఉన్న అవినావభావ అనుబంధాన్ని నేటితరం విద్యార్థులకు వివరించారు. గురువులను, తల్లిదండ్రులను గౌరవిస్తూ నేటితరం విద్యార్థులందరూ సత్ప్రవర్తనతో ముందుకు సాగితే విజయాలను అందిపుచ్చుకోవచ్చని, మంచి పౌరులుగా రాణించి సమాజానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు మంత్రి ఆనం దిశా నిర్దేశం చేశారు.

## నరసరావుపేటలో వైద్యుల నిర్లక్ష్యం.. ఆపరేషన్ చేసి సర్జికల్ బ్లేడ్ వదిలేశారు!

నరసరావుపేట: ఆపరేషన్ చేసి సర్జికల్ బ్లేడ్‌ను శరీరంలో వదిలేసిన ఘటన పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. నరసరావుపేట బాలయ్యనగర్‌కు చెందిన రమాదేవి(22) ఇటీవల ఆసుపత్రిలో చేరింది. ఆమెకు డాక్టర్ నారాయణ స్వామి, సిబ్బంది శస్త్ర చికిత్స చేశారు. తర్వాత నొప్పి తీవ్రంగా రావడంతో సిబ్బంది దృష్టికి ఆమె తీసుకెళ్లారు. నొప్పి సహజమని వారు బాధితురాలికి నచ్చజెప్పారు. ఈక్రమంలో శుక్రవారం ఆమెకు స్కానింగ్ చేయగా.. తొడ దగ్గరలో సర్జికల్ బ్లేడు ఉన్నట్లు గుర్తించారు. దీంతో బాధిత మహిళ బంధువులు కంగుతిన్నారు. ఆపరేషన్ సమయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఆసుపత్రిలో ఆందోళనకు దిగారు.



## వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుండు సున్నా ఖాయం: మంత్రి సవిత జోస్యం

రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ఇప్పుడున్న 11 సీట్లు కూడా గల్లంతై, గుండా సున్నా మిగలడం తథ్యమని మంత్రి సవిత జోస్యం చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి జెడ్పీ హైస్కూల్లో జరిగిన మెగా పీటీఎంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ పరకామణి చోరీఘటనపై జగన్ వ్యాఖ్యలను మంత్రి సవిత తప్పుబట్టారు. పరకామణి చోరీ చిన్న దొంగతనం అనడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చోరీలు జరగడంపై క్షమించరాని నేరమన్నారు. పరకామణి చోరీ జగన్‌కు చిన్న దొంగతనం కావొచ్చని, కాని కోర్టులకు ఇది పెద్ద



నేరమేనని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంతో జగన్ మైండ్ బ్లాంక్ అయిందని విమర్శించారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంపై తప్పుడు అబద్ధాలతో ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో హాస్టళ్లను, గురుకులాలను గాలికొదిలేశారని మంత్రి సవిత విమర్శించారు.

## విద్యార్థులకు శుభవార్త.. పావలా వడ్డీకే రుణాలు

విద్యావ్యవస్థలో వినూతనమైన అత్యాధునిక మార్పులకు ఏపీ గవర్నమెంట్ ప్రయత్నం చేస్తోంది. విదేశీ విద్యను ప్రోత్సహించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా విద్యార్థులకు శుభవార్త తెలిపింది. పావలా వడ్డీతో రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. 'కలలకు రెక్కలు'పేరుతో పథకాన్ని ప్రవేశ పెట్టనుంది. ఈ మేరకు 'పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడమే కలలకు రెక్కలు పథకం లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



# పాన్ మసాలాపై కొత్త సెస్సు..

## ముజువాణీ ఓటుతో ఆమోదించిన లోక్ సభ..!



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఆరోగ్య భద్రత నుంచి జాతీయ భద్రతకు సంబంధించిన కీలక బిల్లు 2025 ముజువాణీ ఓటుతో పాసైంది. ప్రజారోగ్యానికి ప్రతిబంధకంగా మారిన పాన్ మసాలాలపై కొత్త సెస్సు కు ఆమోదం లభించింది. ఈ సెస్సు ద్వారా వచ్చిన ఆదాయాన్ని రక్షణ శాఖకు కేటాయిస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. చర్చలో పాల్గొన్న సభ్యులకు అభినందనలు తెలిపిన ఆమె పాన్ మసాలాపై వచ్చిన పన్నులును భద్రతకు ఉపయోగించడానికి గల కారణాలను వెల్లడించారు.

ఆరోగ్య భద్రత నుంచి జాతీయ భద్రత బిల్లు-2025పై చర్చ సందర్భంగా పాన్ మసాలాపై విధించిన సెస్సును రక్షణ బడ్జెట్‌కే కేటాయించడం ఏంటీ? అని కొందరు సభ్యులు ప్రశ్నించారు. వారి సవాల్‌కు నిర్మలా సీతారామ్ సభలోని ఏ ఒక్కరూ పాన్ మసాలా ఉత్పత్తులపై తక్కువ పన్ను ఉండాలని కోరుకోవడం లేదు. డబ్బును ఏ పనికోసమైనా ఖర్చు చేయొచ్చు. కానీ, ఆదాయాన్ని సమకూర్చుకోవడం అనేదానికి సరైన విధానం ఉండాలి అని బదులిచ్చారు.

'ప్రజారోగ్యం అనేది రాష్ట్ర పరిధిలోని అంశం. రక్షణ అనేది కేంద్రం జాబితాలోనిది. ప్రస్తుత రోజుల్లో సమర్థమైన రక్షణ సదుపాయాలు ఉండడం చాలా అవసరం. అందుకని ఆదాయ వనరులను పెంచుకోవాల్సి ఉంది. ఆనారోగ్యానికి కారణమయ్యే పాన్ మసాలా వంటివి తక్కువ ధరకే లభించకుండా చూడానేది మా లక్ష్యం' అని చర్చ సందర్భంగా నిర్మలా సీతారామన్ తెలిపారు. పాన్ మసాలా ఉత్పత్తుల వాడకంను బట్టి వాటిపై జీఎస్టీ కింద 40 శాతం పన్ను విధిస్తామని, ఈ సెస్ ప్రభావం జీఎస్టీ రాబడిపై ఏమాత్రం ఉండదని ఆర్థిక మంత్రి చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం 6.1 శాతంగా ఉందని.. 2010-14లో ఈ శాతం 7గా ఉందనే విషయాన్ని మంత్రి సభకు నివేదించారు.

# అనిల్ అంబానీకి మరో షాక్..

## రూ.1,120 కోట్ల ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ




**న్యూఢిల్లీ:** ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి మరో షాక్ తగిలింది. యస్ బ్యాంక్‌ను మోసం కేసులో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.1,120 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా అటాచ్ చేసింది. ఇందులో 18 ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్, షేర్‌హోల్డింగ్ వంటివి ఉన్నాయి.

రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు చెందిన 7 ఆస్తులు, రిలయన్స్ పవర్ లిమిటెడ్‌కు చెందిన రెండు ఆస్తులు, రిలయన్స్ వాల్యూ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 9 ఆస్తులు ఉన్నాయి. కాగా, మనీలాండరింగ్‌కు సంబంధించి ఇప్పటికే రూ.8,997 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజా చర్యతో వాటి విలువ మొత్తం రూ.10 వేల కోట్లకు పైగానే ఉంది. కాగా, అనిల్ అంబానీకి చెందిన గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.

# ఆర్బీఐ నిర్ణయంతో స్టాక్ మార్కెట్లకు జోష్...

## లాభాల్లో ముగిసిన సూచీలు

## రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్బీఐ

## లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు

## వృద్ధి రేటు అంచనాలను 7.3 శాతానికి పెంచిన కేంద్ర బ్యాంక్

## ద్రవ్యోల్బణ అంచనాలను 2 శాతానికి తగ్గింపు

## పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు



**ముంబై:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలకమైన రెపో రేటును తగ్గించడంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఆర్బీఐ అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయం సూచీలకు జోష్ ఇచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 447.05 పాయింట్లు లాభపడి 85,712.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 152.7 పాయింట్లు పెరిగి 26,186.45 వద్ద ముగిసింది.

గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి చేర్చింది. పాలసీ వైఖరిని మాత్రం 'న్యూట్రల్'గానే కొనసాగించింది. దీంతో పాటు 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను 2.6 శాతం నుంచి 2 శాతానికి భారీగా తగ్గించింది. అదే సమయంలో వృద్ధి అంచనాను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచింది.

విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ కీలకమైన 26,000 పాయింట్ల మార్కుపైన స్థిరంగా ముగియడం సానుకూల సంకేతం. 26,000%-%26,100 స్థాయి వద్ద మార్కెట్‌కు బలమైన మద్దతు ఉందని, మార్కెట్ మరింత పైకి వెళ్లాలంటే 26,300 స్థాయిని దాటాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం పెరుగుదలతో టాప్ గెయినర్‌గా నిలిచింది. బ్యాంకింగ్, ఆటో, ఐటీ, మెటల్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు లాభపడ్డాయి.

మరోవైపు మీడియా, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ప్రధానంగా లాభపడగా... హిందుస్థాన్ యూనిలీవర్, సన్ ఫార్మా, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టపోయాయి.



# ఐసీసీ ప్లేయర్ ఆఫ్‌ది మంత్.. షఫాలీ వర్మ నామినేట్

న్యూఢిల్లీ: మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన షఫాలీ వర్మ నవంబర్ నెలకు.. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా నామినేటైంది. సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు ప్రతికా రావల్ గాయపడటంతో అనూహ్యంగా జట్టులోకి షఫాలీ వచ్చింది. మొదటి మ్యాచ్‌లో విఫలమైంది. అయితే దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో.. 78 బంతుల్లో 87 పరుగులు చేసి సత్తా చాటింది. బంతితోనూ విజృంభించింది. కీలకమైన రెండు వికెట్లను నేలకూల్చింది. ఇలా షఫాలీ వర్మ తన ఆల్ రౌండ్ ప్రదర్శనతో రాణించి.. టీమ్ఇండియా తొలిసారి విశ్వవిజేతగా అవతరించడంలో కీలకంగా నిలిచింది. తాజాగా ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ కోసం యూఏఈకి చెందిన ఈషా ఓజా, థాయ్‌లాండ్‌కు చెందిన తిపట్చా పుట్టావాంగ్ కూడా షఫాలీ వర్మతో పాటు నామినేట్ అయ్యారు. ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ సందర్భంగా ఓజా మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసింది. ఏడు టీ20 మ్యాచ్‌ల్లో ఆమె 137.50 స్ట్రైక్ రేట్‌తో 187 పరుగులు చేసింది. బంతితో కూడా రాణించింది. 18.14 సగటుతో 7 వికెట్లు తీసింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన ఎడమచేతి వాటం స్పిన్నర్ తిపట్చా పుట్టావాంగ్ ఐసీసీ ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ టోర్నమెంట్‌లో 15 వికెట్లు సాధించింది.

### కేఎల్ రాహుల్ టాప్ ఆర్డర్‌లో ఆడితే

# మరిన్ని సెంచరీలు చేస్తాడు

**డేల్ స్టెయిన్**

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం టీమ్ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగుతోంది. ఇందులోభాగంగా ఇప్పటికే రాంచీ, రాయ్‌పుర్ వేదికగా రెండు వన్డేలు ముగిశాయి. తొలి వన్డేలో టీమ్ఇండియా 17 పరుగులతో విజయం సాధిస్తే, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ రెండు మ్యాచుల్లోనూ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో రాణించాడు. మొదటి వన్డేలో 60 (56 బంతుల్లో), రెండో మ్యాచ్‌లో 66లి (43 బంతుల్లో) పరుగులు చేశాడు. బ్యాటింగ్‌లో నిలకడ ప్రదర్శిస్తున్న అతన్ని దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు.

'కేఎల్ రాహుల్‌కు ఎలా ఆడాలో తెలుసు. ఒకవేళ అతడు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగితే.. కచ్చితంగా సెంచరీలు సాధించగలడు. కానీ ప్రస్తుతం అతడు ఆడుతున్న స్థానాల్లో... జట్టు కోసం తాను ఎలాంటి పాత్ర పోషించాలో తెలుసు. మొదటివన్డేతో పాటు, రెండో మ్యాచ్‌లోనూ అతడు హాఫ్ సెంచరీలు చేశాడు. ఎప్పుడు తగ్గాలో.. ఎప్పుడు వేగంగా ఆడాలనే విషయంపై అతడికి అవగాహన ఉంది' అని డేల్ స్టెయిన్ కొనియాడాడు.

కేఎల్ రాహుల్ ఇప్పటివరకు వన్డేల్లో 83 ఇన్నింగ్స్‌ల్లో 49.50 యావరేజ్‌తో 3,218 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు,



20 హాఫ్ సెంచరీలున్నాయి. అతడు చివరిసారిగా వన్డే వరల్డ్‌కప్ 2023లో నెదర్లాండ్స్ మీద సెంచరీ చేశాడు. ఆ మ్యాచ్‌లో అతడు కేవలం 64 బంతుల్లోనే 102 పరుగులు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాల కారణంగా వన్డే జట్టుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో టీమ్ఇండియా 17 పరుగులతో విజయం సాధించింది. రాయ్‌పుర్ వన్డేలో సఫారీల జట్టు 4 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన మూడో వన్డే విశాఖపట్నం వేదికగా రేపు (శనివారం) జరగనుంది. దీంతో అభిమానుల్లో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది.

# అందుకే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికా..

**ఆండ్రీ రస్సెల్**

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఇటీవలే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్‌కు ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు అతడిని రిలీజ్ చేసింది. అనంతరం అతడు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం రస్సెల్‌ను పవర్ కోచ్‌గా నియమించుకుంది. అయితే తాను ఐపీఎల్‌కు వీడ్కోలు నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో, తాజాగా.. 'క్రిక్‌బజ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు.

'ఐపీఎల్ పెద్ద టోర్నీ. ఇందులో మ్యాచ్‌లు ఎక్కువ. ప్రయాణాలు కూడా అధికం. ప్రాక్టీస్, జిమ్, వర్క్‌లోడ్.. వీటన్నింటినీ సమతూకం చేసుకోవడం చాలా కష్టం. ఆల్‌రౌండర్‌గా నాకు మరింత ఛాలెంజింగ్. నేను కేవలం బ్యాటింగ్ చేస్తేనే సరిపోదు. ఒక మ్యాచ్‌లో కనీసం రెండు ఓవర్లపాటు బౌలింగ్ చేయాలి. నేను చక్కగా బౌలింగ్ చేయగలిగాను అనుకున్నప్పుడే.. బ్యాటింగ్‌లో కూడా రాణించగలను. నేను కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్యాటింగ్‌కు వచ్చి, సిక్స్‌లు కొడితే సరిపోతుందనుకోను. బ్యాటింగ్, బౌలింగ్ రెండూ చేసినప్పుడే నేను ఆటను ఆస్వాదించగలను' అని ఆండ్రీ రస్సెల్ వివరించాడు.

"హాయ్ కేకేఆర్ ఫ్యాన్స్, నేను మీ ఆండ్రీ రస్సెల్. కేకేఆర్ అభిమానులకు ఓ విషయం చెప్పాలి. ఐపీఎల్ నుంచి నేను రిటైర్ అవుతున్నా.



కేకేఆర్ నాకు ఎన్నో మంచి అవకాశాలను, అద్భుతమైన జ్ఞాపకాలను ఇచ్చింది. భారీ సిక్స్‌లు కొట్టడం, మ్యాచ్‌లు గెలవడం ఇవన్నీ ఒక గొప్ప ఆటగాడిలా మీ ముందుంచాయి. ఈ నిర్ణయం తీసుకుందాం అనుకుంటున్నప్పుడు ఇది నా కెరీర్‌లో బెస్ట్ నిర్ణయం అవుతుందని అనిపించింది. నేను ఐపీఎల్‌లో ఫేడౌట్ అవ్వాలని అనుకోవడం లేదు. ఓ లెగసీని అందించి వెళ్లాలని అనుకున్నాను. ప్రేక్షకులు 'రిటైర్‌మెంట్ ఎందుకు?' అని ప్రశ్నించే రోజుల్లోనే రిటైర్ అవ్వడం ఉత్తమం అనేది నా భావన." అని ఆండ్రీ రస్సెల్ ఇటీవల సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో వివరించాడు.

రస్సెల్.. ఐపీఎల్‌లో ఇప్పటివరకు 140 మ్యాచుల్లో 174.18 స్ట్రైక్ రేట్‌తో 2,651 పరుగులు చేశాడు. ఇందులో 12 హాఫ్ సెంచరీలున్నాయి. అలాగే బౌలింగ్‌లో 9.51 ఎకానమీతో 123 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకసారి అయిదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు.

# షమీ ఎక్కడ?.. సెలెక్టర్లపై హర్భజన్ సింగ్ ఫైర్

## మహ్మద్ షమీని జట్టులోకి తీసుకోకపోవడంపై హర్భజన్ ఫైర్

## దేశవాళీ క్రికెట్‌లో షమీ అద్భుతంగా రాణిస్తున్నాడని వెల్లడి

## బుమ్రా లేని భారత బౌలింగ్ విభాగం బలహీనంగా ఉందని వ్యాఖ్య

## వైట్‌బాల్ క్రికెట్‌లో మ్యాచ్ విన్నర్లు కరువయ్యారని ఆందోళన

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, భారత జట్టు యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. వెటరన్ పేసర్ మహ్మద్ షమీని జట్టులోకి తీసుకోకపోవడాన్ని ఆయన ప్రశ్నించాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ షమీని పక్కనపెట్టడం సరికాదన్నాడు. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమీ ఐదు మ్యాచ్‌లలో తొమ్మిది వికెట్లు తీయగా, చివరి మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో సత్తా చాటాడు.

తన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడిన హర్భజన్ "అసలు షమీ ఎక్కడ? అతడిని ఎందుకు ఆడించడం లేదో నాకు అర్థం కావడం లేదు. ప్రసిద్ధ్ కృష్ణ మంచి బౌలరే, కానీ అతడు ఇంకా చాలా నేర్చుకోవాలి. మంచి బౌ



లర్లను మీరు నెమ్మదిగా పక్కనపెడుతున్నారు" అని అన్నాడు. జస్ప్రీత్ బుమ్రా జట్టులో లేకపోవడం బౌలింగ్ విభాగాన్ని బలహీనపరుస్తోందని అభిప్రాయపడ్డాడు. "బుమ్రా ఉంటే మన బౌలింగ్ విభాగం ఒకటి, అతను లేకపోతే పూర్తిగా మరొకటి. బుమ్రా లేకుండా కూడా మ్యాచ్‌లు గెలవడం మనం నేర్చుకోవాలి" అని ఆయన స్పష్టం చేశారు.

వైట్ బాల్ క్రికెట్‌లో మ్యాచ్‌లు గెలిపించే బౌలర్లు జట్టులో కరువయ్యారని, ఇది పెద్ద ఆందోళన కలిగించే విషయమని భజ్జీ పేర్కొన్నారు. "ఇంగ్లండ్‌లో బుమ్రా లేనప్పుడు సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. స్పిన్నర్లలో కుల్దీప్ ఉన్నాడు, కానీ మిగతావాళ్ల సంగతేంటి? వికెట్లు తీయగల స్పిన్నర్లను గుర్తించాలి. వరుణ్ చక్రవర్తిని టీ20లతో పాటు వన్డేల్లోకి కూడా తీసుకురావాలి" అని సూచించాడు.

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారత్ 359 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకోలేక ఓటమిపాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హర్భజన్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ ఓటమితో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ప్రొటీస్ జట్టు 1-1తో సమం చేసింది.

MOVIE TIME

### సైక్ సిద్ధార్థ నుంచి

# సాంగ్ విడుదల



**టాకీస్:** శ్రీనందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్దార్థ' వరుణ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోంది. యామిని భాస్కర్ కథానాయిక. డిసెంబర్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని లవ్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'ధుమ్ తకుమ్..' అంటూ సాగే ఈ పాటకు కాశర్ల శ్యామ్ లిరిక్స్ రాయగా.. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు.

### పుష్ప-2 విడుదలకు

# ఏడాది

### ఎమోషనల్ పోస్ట్ చేసిన అల్లు అర్జున్

### విమల్ థియేటర్‌లో పుష్ప-2 టిక్కెట్ల రగడ




**టాకీస్:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రూల్' గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్‌ను అందుకోవడమే కాకుండా రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం విడుదలై నేటికి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మూవీని గుర్తుచేసుకుంటూ అల్లు అర్జున్ సోషల్ మీడియా వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుష్ప' ఫ్రాంచైజీ తన జీవితంలో ఒక మరువలేని ప్రయాణంగా మిగిలిందని అల్లు అర్జున్ పేర్కొన్నారు. 'పుష్ప' మా జీవితంలో ఐదేళ్ల పాటు సాగిన మరువలేని ప్రయాణంగా నిలిచింది. ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి లభించిన అపారమైన ప్రేమ, శక్తి, మా కళను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి అవసరమైన ధైర్యాన్ని అందించింది. ఈ చిత్రాన్ని ఒక అద్భుతంగా మార్చినందుకు ఈ దేశంలోని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరికీ మేము ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటాము. నా కళాకారులందరితో, సాంకేతిక నిపుణులతో, మొత్తం యూనిట్‌తో, నిర్మాతలు, పంపిణీదారులు మరియు ముఖ్యంగా మా కెప్టెన్ సుకుమార్ గారితో కలిసి ఈ ప్రయాణంలో నడవడం నాకు దక్కిన గొప్ప గౌరవం. ఈ ప్రయాణంలో భాగమైన మీ ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.




# తేరే ఇష్క్ మే తెలుగు ట్రైలర్ విడుదల

టాకీస్: కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే'. ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఇదే సినిమాను తెలుగులో అమరకావ్యం పేరుతో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంఝణా', 'అత్రంగి రే' తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.




# అవతార్-3లో వారణాసి స్పెషల్ వీడియో

**టాకీస్:** 'వారణాసి' సినిమాను దర్శకధీరుడు రాజమౌళి భారీ స్థాయిలో తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిసినప్పటినుంచే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి ఏర్పడింది. తాజాగా దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం హాలీవుడ్‌లోనూ వైరల్ అవుతోంది. అవతార్ 3 సినిమాలోను 'వారణాసి' సర్‌ప్రైజ్ ఉండనున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. దీంతో ఈ న్యూస్ సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. 'అవతార్' డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ అంటే రాజమౌళికి ఎంత అభిమానమో తెలిసిన విషయమే. సందర్భం వచ్చినప్పుడల్లా జక్కన్న ఆయన గురించి చెబుతూనే ఉంటారు. ఇప్పుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వం వహించిన 'అవతార్ 3' సినిమాలో రాజమౌళి 'వారణాసి' సర్‌ప్రైజ్ ప్లాన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ 19న 'అవతార్ 3' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలోనే 'వారణాసి'కి సంబంధించిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించే ఆలోచన చేస్తున్నట్లు హాలీవుడ్ మీడియా పేర్కొంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో మహేశ్ రుద్ర పాత్రలో నటిస్తున్నారు. విలన్ పాత్ర కుంభగా పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ప్రియాంకా చోప్రా.. మందాకినిగా సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి లుక్స్‌కూ విశేష స్పందన దక్కింది.



# ఆర్థిక లావాదేవీలపై అనవసర వార్తలు తగదు

### త్వరలోనే అఖండ-2 విడుదల ఉంటుదన్న దగ్గుబాటి

**టాకీస్:** నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో భారీ అంచనాల మధ్య రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' విడుదల వాయిదా పడటం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదల కావాల్సి ఉండగా.. కొన్ని ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ వివాదంపై తాజాగా టాలీవుడ్ అగ్ర నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అయిన సురేష్ బాబు స్పందించారు. 'అఖండ 2' వాయిదాకు గల అసలు కారణాలను బయటపెట్టకుండా అనవసరపు ఊహాగానాలకు తెరదించారు. సైక్ సిద్దార్థ సినిమా కార్యక్రమంలో పాల్గొన్న సురేష్ బాబు 'అఖండ 2' ఇష్యూ గురించి ప్రస్తావిస్తూ.. నేను కూడా ఆ సమస్య గురించి మాట్లాడాటానికే వెళ్లాను. త్వరలోనే 'అఖండ 2' సమస్య పరిష్కారమవుతుంది. అఖండ 2 కి సంబంధించి అన్నీ ఆర్థికపరమైన ఇబ్బందులే అవి బయటకు వెల్లడించకూడదు అని అన్నారు. అలాగే సినిమాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల గురించి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. ఇది దురదృష్టకరం. ప్రతిఒక్కరూ 'అఖండ 2' రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. అన్ని కోట్లు చెల్లించాలట అని రాస్తున్నారు. అవి అన్నీ అనవసరపు ప్రస్తావనలు అని సురేష్ బాబు స్పష్టం చేశారు. ఆడియన్స్ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమా విడుదలవుతుంది. అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# జపాన్‌లో బాహుబలి ప్రత్యేక ప్రదర్శన

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాస్

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మరోసారి తన క్రేజ్‌ను విదేశాల్లో నిరూపించాడు. జపాన్‌లో జరిగిన 'బాహుబలి: ది ఎపిక్' ప్రత్యేక ప్రదర్శనకు హాజరైన ప్రభాస్, అక్కడ అభిమానులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా తీసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఇప్పుడు దుమ్ము రేపుతున్నాయి. ఈ ఫోటోలలో ప్రభాస్ కనిపించిన కొత్త లుక్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఇప్పటివరకు చూడని స్టైలిష్ అవతారంలో కనిపించిన డార్లింగ్, జపాన్ అభిమానులను మాత్రమే కాదు, ఇండియన్ సినీ లవర్స్‌ని కూడా షాక్‌కి గురి చేశారు. ప్రభాస్ తాజా లుక్ చూసిన అభిమానులు.. ఈ లుక్ స్పిరిట్‌ది అయి ఉంటుందేమో అని అంటున్నారు. జపాన్ ఫ్యాన్స్‌తో ప్రభాస్ ఆప్యాయంగా మాట్లాడిన వీడియోలు, ఫోటోలు జపనీస్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో తెగ వైరల్ అవుతున్నాయి. దీంతో మరోసారి 'బాహుబలి' మేనియా కనిపిస్తోంది. ఇటీవల బాహుబలి ది ఎపిక్ చిత్రం ఇండియాలో విడుదలై మంచి టాక్ అందుకుది. బాహుబలి రెండు పార్ట్‌లని ఒక పార్ట్‌గా చేసి బాహుబలి ది ఎపిక్ పేరుతో విడుదల చేశారు. ఇక ఇదిలా ఉంటే ప్రభాస్ ప్రస్తుతం రెండు భారీ పాన్-ఇండియా ప్రాజెక్టుల్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే చిత్రం చేస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ చాలా కాలం క్రితమే ప్రారంభమైంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.